ఈఈ నూనె శ్రీధర్‌కు ముగిసిన ఏసీబీ కస్టడీ

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: అక్రమ ఆదాయ కేసులో ఏసీబీ అరెస్ట్ చేసిన ఇరిగేషన్ శాఖ ఈఈ శ్రీధర్ కస్టడీ విచారణ ముగిసింది. ఐదు రోజుల పాటు ఏసీబీ అధికారులు విచారించారు. కస్టడీ గడువు ముగియడంతో శ్రీధర్ ను చంచల్ గూడ జైలుకు రిమాండ్ కు తరలించారు. అక్రమ ఆదాయ కేసులో 14వ తేదిన ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. నాంపల్లి ఏసీబీ కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. ఈ క్రమంలో విచారించేందుకు ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేసి ఐదు రోజుల పాటు కస్టడీకి తీసుకుని విచారించారు. శ్రీధర్ కు చెందిన బ్యాంకు లాకర్స్ ను ఓపెన్ చేసి నగదు, కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు.

సీఎం రేవంత్ రెడ్డికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కీలక విజ్ఞప్తి

విశ్వంభర, హైదరాబాద్ : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ భేటీ అయ్యారు. వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంపరిధిలో ఆధునిక గోశాల నిర్మించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆది శ్రీనివాస్ కోరారు. ఆధునిక గోశాల నిర్మాణం కోసం వేములవాడ సమీపంలోని మరిపెల్లి గ్రామంలో 40 ఎకరాల స్థలం గుర్తించినట్టు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ భేటీలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, వాకిటి శ్రీహరితో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు ఉన్నారు. కాగా, వేములవాడ రాజన్న ఆలయానికి చెందిన తిప్పాపూర్ గోశాలలో ఇటీవల పలు కోడెలు మృతిచెందిన విషయం తెలిసిందే. అనారోగ్యం కారణంగా కోడెలు మృతి చెందినట్లు పశు వైద్యాధికారులు నిర్ధారించారు. దీంతో ఈ గోశాలలో ఇప్పటివరకు మృతిచెందిన కోడెల సంఖ్య 31కి చేరింది. ఈ క్రమంలోనే ఆధునిక గోశాల నిర్మించాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం దృష్టికి ఆది శ్రీనివాస్ తీసుకొచ్చారు.

ఆమ్ ఆద్మీ పార్టీ అద్భుతమైన విజయం బీజేపీకి చావుదెబ్బ

- ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్

విశ్వంభర, హైదరాబాద్ : గుజరాత్ , పంజాబ్‌లో జరిగిన ఉప ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ అద్భుతమైన విజయం బీజేపీ కు చావుదెబ్బ తగిలిందని ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వినర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ పేర్కొన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ పారదర్శక పనితీరు చూసి ఇటీవలే జరిగిన ఉప ఎన్నికల్లో బిజెపి మరియు కాంగ్రెస్ రెండింటినీ ప్రజలు తిరస్కరించారని తెలిపారు. హైదరాబాద్, లిబర్టీ, ఆప్ కార్యాలయం నుండి మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో డాక్టర్ దిడ్డి సుధాకర్ గుజరాత్‌లోని విసావదర్ స్థానంలో మరియు పంజాబ్‌లోని లూధియానా వెస్ట్ స్థానంలో ఆమ్ ఆద్మీ పార్టీ అద్భుతమైన విజయం ఆప్ శ్రేణులకు నూతన ఉత్సాహాన్ని నింపిందని, ఈ ఉప ఎన్నికలలో కూడా విజయం సాధించి విజయ ఆధిక్యాన్ని మెరుగుపరచిందన్నారు. ప్రధాని మోదీ బూటకపు మాటలను, కాంగ్రెస్ పార్టీ చేతగానితనాన్ని దేశ ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చడానికి ఇప్పుడు ఆమ్ ఆద్మీ పార్టీ ఒక్కటే ప్రత్యామ్నాయం అని అందుకే ప్రజలు ఆదరిస్తున్నారన్నారు.ఉప ఎన్నికలలో విజయాలు ఆప్ జాతీయ ప్రణాళికలకు అనుగుణంగా వస్తున్నాయని, బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థులను నిలబెట్టాలని అలాగే హైదరాబాద్ జూబిలీ హిల్స్ అసెంబ్లీ స్తానం నుండి కూడా పోటీ చేయాలనీ యోచిస్తున్నట్లు తెలిపారు.

బాధితులు ఫుల్ ఖుష్..1130 ఫోన్ లు రికవరీ

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలో 1130 మొబైల్ ఫోన్ లను మంగళవారం పోలీసులు రికవరీ చేశారు. రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలో గత రెండు నెలలో మొబైల్ ఫోన్ లు మిస్సింగ్, చోరీలకు సంబంధించి సీఈఐఆర్(సెంట్రల్ ఎక్విప్ మెంట్ ఐడెంటింటి రిజిస్ట్రీ) పోర్టల్ లో బాధితులు నమోదు చేశారు. పోలీసు కమిషనర్ సుధీర్ బాబు ఈ మొబైల్ ఫోన్ ల రికవరీ కోసం సీసీఎస్ మల్కాజిగిరి, భోనగిరి, ఎల్బీనగర్ సిబ్బంది, అధికారులతో ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశారు.ఐటీ సెల్ సహకారంతో ఈ టీంలు పని చేసి 2 నెలలో 3.50 కోట్లు విలువ చేసే 1130 మొబైల్ ఫోన్ లను స్వాధీనం చేసుకున్నారు. వీటిని మంగళవారం ఫోన్ ల యజమానులకు అందించి వారిలో సంతోషాన్ని నింపారు. ఎల్బీనగర్ సీసీఎస్ 706, మల్కాజిగిరి సీసీఎస్ 312, భోనగిరి సీసీఎస్112 ఫోన్ లను రికవరీ చేశారు. ఇలా ఈ ఏడాది మొత్తంలో రాచకొండ పోలీసులు 3694 ఫోన్ లను రికవరీ చేసి యజమానులకు అందించారు. ఈ రికవరీ కోసం పని చేసిన పోలీసు సిబ్బందిని సీపీ అభినందించారు.

ఇప్పుడు అంతా మొబైల్ ఫోన్‌తోనే కాబట్టే జాగ్రత..

మొబైల్ ఫోన్ చోరీకి గురైన అది మిస్సింగ్ అయినా ఆ యజమానిని తీవ్ర గందరగోళానికి గురి చేస్తుంది. ఫోన్ లో ఉండే వ్యక్తి గత సమాచారంతో పాటు ఆర్థిక పరమైన డాటా కూడా గుర్తు తెలియని వారి చేతులకు చిక్కే అవకాశం ఉంది. కాబట్టీ ఈ మొబైల్ ఫోన్ లను జాగ్రత్తగా ఉంచుకోవాలని సీపీ సుధీర్ బాబు తెలిపారు. మొబైల్ ఫోన్ విషయంలో నిర్లక్ష్యం చేస్తే ఇతరులు ఆ ఫోన్ తో మిమ్మల్ని బ్లాక్ చేయడంతో పాటు ఇంకా అనేక బెదిరింపులు, వేధింపులకు గురి చేసే అవకాశం ఉంది. కాబట్టీ ఫోన్ ను కాపాడుకోవడం తో పాటు అందులోని సమాచారం బయటికి పోకుండా పటిష్టమైన పాసువార్డులను ఏర్పాటు చేసుకోవాలని సీపీ కోరుతున్నారు.

'గోదావరి-బనకచర్ల'పై ఏ వేదికపైనైనా చర్చకు సిద్ధం

- పదేళ్లలో కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో అద్భుత ప్రగతి సాధించాం
- సీఎం రేవంత్ రెడ్డి దాన్ని తక్కువ చేసి చూపి రాష్ట్ర ప్రజలను అవమానించారు
- స్థానిక ఎన్నికల్లో గెలుపుపై భరోసా లేకనే రైతు భరోసా..
- చిత్తశుద్ధి ఉంటే కౌలు రైతులకు రైతు భరోసా ఇవ్వు..
- మాజీ మంత్రి హరీష్‌రావు

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: 'గోదావరిబనకచర్ల ప్రాజెక్టుపై ఏ వేదిక మీదనైనా చర్చించేందుకు సిద్ధంగా ఉన్నాం. నీ ద్రోహాన్ని గణాంకాలతో సహా నిరూపించి తెలంగాణకు చేస్తున్న మోసాన్ని బట్టబయలు చేస్తా' అని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. రైతుభరోసా సంబరాల్లో భాగంగా సీఎం చేసిన వ్యాఖ్యలపై 'ఎక్స్' వేదికగా హరీశ్‌రావు స్పందించారు. ప్రభుత్వ కార్యక్రమం అని మరిచి.. ప్రత్యేక రాష్ట్ర సాధకుడు.. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై సంస్కారం లేని విధంగా మాట్లాడి తన చిల్లర బుద్ధిని మరోసారి ప్రదర్శించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణకు రేవంత్‌రెడ్డి శనిలా, శాపంలా మారారని పేర్కొన్నారు. 'ఉల్టా చోర్ కొత్వాల్‌కు డాంటే' అనే రీతిలో పదేళ్ల కేసీఆర్ పాలనలో సాధించిన అద్భుత ప్రగతిని తక్కువ చేసి చూపి రాష్ట్ర ప్రజలను అవమానించారని తెలిపారు. ఎన్నికల్లో అడ్డమైన హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి వాటిని అమలు చేయలేక, ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుంటే ఎటూ పాలుపోక నిరాశ నిస్పృహలతో ప్రతిరోజూ అబద్ధాలతో, బూతులతో నెట్టుకొస్తానంటే కుదరదని హెచ్చరించారు. 'అధికారంలో ఉండి.. సీఎం స్థానంలో ఉండి.. సభా నాయకుడిగా వ్యవహరిస్తున్న నీకు అసెంబ్లీ సమావేశాల ఏర్పాటుకు ప్రతిపక్షం డిమాండ్ చేయాల్సిన పనిలేదని తెలియదా రేవంత్ రెడ్డి' అని నిలదీశారు.

గెలుపుపై భరోసా లేకనే రైతు భరోసా..

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపుపై భరోసా లేకనే విధి లేని పరిస్థితుల్లో రైతుభరోసా వేసి తానే రైతులకు చాంపియన్ అనే బిల్డప్ రేవంత్‌రెడ్డి ఇస్తున్నారని.. దానిని ఎవరూ నమ్మే పరిస్థితిలో లేరని హరీశ్‌రావు పేర్కొన్నారు. దేశంలోనే మొదటిసారి రైతులకు పెట్టుబడి సాయం చేయాలని ఆలోచించి.. రైతుబంధు మొదలు పెట్టి రూ.80 వేల కోట్లు అన్నదాతల అకౌంట్లలో వేసి వ్యవసాయాన్ని పండగలా చేసిన కేసీఆర్‌ను ఉరితీయాలని ఉన్మాదిలా మాట్లాడుతావా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్ష కోట్లే ఖర్చుకాని కాళేశ్వరం ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి జరిగిందంటే ప్రపంచం నవ్విపోతున్నదని పేర్కొన్నారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణ ఎడారిగా మారితే ధాన్యం ఉత్పత్తిలో రాష్ట్రం దేశం నెంబర్ వన్ ఎలా అవుతుందని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కనీసం ఒక చెక్ డ్యామ్ కట్టారా..? ఓ కాలువ తవ్వారా..? అని నిలదీశారు. కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులకు నాలుగు వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి ఆరున్నర లక్షల ఎకరాలకు నీరిచ్చామని.. ఇరిగేషన్ శాఖలో ఈ వివరాలు ఉన్నాయని.. అధికారులను అడిగి తెలుసుకో రేవంత్ రెడ్డి అని సూచించారు. కృష్ణా జలాలపై ఎన్నిసార్లు వాస్తవాలు చెబుతున్నా పనిగట్టుకుని బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు.

చిత్తశుద్ధి ఉంటే కౌలు రైతులకు రైతు భరోసా ఇవ్వు..

'మేడిగడ్డలో కుంగిన రెండు పిల్లర్లకు మరమ్మతులు చేయని దద్దమ్మవి నీవు. ఇప్పుడు అన్నారం, సుందిళ్ల కూడా కూలిందని అని అంటున్నావ్. నీది నోరా, మోరా? నీకు దమ్ముంటే, చిత్తశుద్ధి ఉంటే ఇసుమంతైనా నిజాయితీ ఉంటే 30 లక్షలు మంది కౌలు రైతులకు ఇస్తానన్న రైతు భరోసా ఇచ్చి మాట్లాడు రేవంత్ రెడ్డి?' అని హరీశ్‌రావు సవాల్ విసిరారు. మహిళలకు వడ్డీ లేని రుణాలపై, ఉద్యోగ నియామకాలపై అదే పనిగా అబద్ధాలు చెబితే అవి నిజాలై పోతాయా అని ప్రశ్నించారు. సన్న వడ్లకు బోనస్‌ను రైతుల అకౌంట్లలో వేశానని బోగస్ మాటలు చెప్పొద్దని.. నిజాయితీ ఉంటే రూ.1,200 కోట్ల బోనస్ బకాయిలు అకౌంట్లలో వేయాలని డిమాండ్ చేశారు. రేవంత్ పిల్లి శాపాలకు ఉట్లు తెగయనే విషయాన్ని గ్రహించాలని సూచించారు. 'గెలిచిన వాడు రాజు, ఓడిపోయిన వాడు రావణాసురుడు అని అంటున్నావు. రాహుల్ గాంధీ కూడా రావణాసురుడేనా? ఉన్మాదంలో ఏం మాట్లాడుతున్నావో అర్థం అవుతున్నదా' అని ప్రశ్నించారు. హామీలపై ప్రశ్నిస్తున్నందుకు మాపై బూతులతో చెలరేగుతున్నా.. తాము సంయమనం కోల్పోమని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలు అమలయ్యేదాకా వెంటపడుతూనే ఉంటామని.. అబద్ధాల పుట్టను బద్దలు కొడతామని హెచ్చరించారు.

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీదే విజయం తథ్యం : మంత్రి పొన్నం

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించామని రాష్ట్ర రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డి పట్టణంలో ఐదు కోట్ల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్ ను ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ఎల్లారెడ్డి డివిజన్ కేంద్రంలో నూతన బస్ డిపో ఏర్పాటు కోసం సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజాపాలనలో భాగంగా దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి రేషన్ లబ్ధిదారుడికి సన్న బియ్యం ఉచితంగా అందజేస్తున్నామని, రైతన్నల శ్రేయస్సు కోసం పెట్టుబడి సాయం కింద ప్రతి రైతుకు ఎకరాకు 12 వేల రూపాయలు అందజేస్తున్నామని అన్నారు. రాబోయే రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని, ఇందుకోసం కాంగ్రెస్ శ్రేణులు అందరూ గ్రామాల్లో ప్రజల సమస్యలను తెలుసుకుంటూ సమస్యల పరిష్కారం కోసం చేయాలని చూపించారు.రాష్ట్రం ఏర్పడిన తర్వాత 60 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామని, 18 నెలల కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఆర్టీసీ కార్మికుల పాత్ర కీలకమని గుర్తుకు చేసిన ఆయన ఆర్టీసీ సంస్థ నష్టాల నుండి లాభాల్లోకి తీసుకువచ్చేందుకు సీఎం ఆధ్వర్యంలో శతవిధాల ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ములుగు, పెద్దపల్లి జిల్లా కేంద్రాలలో నూతన బస్ డిపోలు ఏర్పాటు చేశామని అన్నారు. ఎల్లారెడ్డి లో బస్ డిపో ఏర్పాటు కోసం ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు తనని చాలాసార్లు కలిసి విజ్ఞప్తి చేశారన్నారు. ఈ ప్రాంత ప్రజల చిరకాల స్వప్నం బస్ డిపో ఏర్పాటు కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మి కాంతారావు, జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర, బాన్సువాడ డిపో మేనేజర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, ప్రభుత్వ శాఖల అధికారులు, ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బనకచర్లపై రాష్ట్ర ప్రభుత్వానికి సీరియస్‌నెస్ లేదుః జగదీశ్ రెడ్డి

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: గోదావరి నీళ్లను తరలించి ఏపీ సీఎం చంద్రబాబు తెలంగాణను ఎడారిగా మార్చే ప్రయత్నం చేస్తున్నారని మాజీమంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. గోదావరి, బనకచర్లపై రాష్ట్ర ప్రభుత్వానికి సీరియస్‌నెస్ లేకుండా పోయిందన్నారు. కేబినెట్‌లో ఈ ప్రాజెక్టుపై సీరియస్ చర్చ జరగలేదన్నారు. కృష్ణా నది నీళ్ల విషయంలో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని.. గోదావరిలోనూ అన్యాయం చేయాలని చూస్తున్నారని పేర్కొన్నారు. గోదావరి, బనకచర్లపై అన్ని పార్టీలు ఏకం కావాలని కోరారు. చంద్రబాబు నాయుడును చర్చలకు పిలవాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పనికిమాలిన చర్య అని అన్నారు. వెంటనే అపెక్స్ కౌన్సిల్ నిర్వహించాలని కేంద్రాన్ని డిమాండ్ చేయాలని అన్నారు. చంద్రబాబుతో చర్చలు చేస్తే రాష్ట్రానికి నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. గోదావరి నదీ జలాలు తెలంగాణ బతుకుదెరువు అంశమని.. రాష్ట్ర ప్రభుత్వం చర్యలు సరైన మార్గంలో లేవని ఆరోపించారు. గోదావరి, కావేరి లింక్ అని చంద్రబాబు నాయుడు చెప్పడం పెద్ద మోసమని.. గోదావరి, కావేరి లింక్‌పై ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఎప్పుడో అభ్యంతరం చెప్పిందని తెలిపారు. బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు గోదావరి జలాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. త్వరలోనే గోదావరి ట్రిబ్యునల్ వచ్చే అవకాశం ఉందని.. అది రాకముందే 200 టీఎంసీలకు హక్కు కల్పించుకోవాలని చంద్రబాబు భావిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రానికి నీళ్లు దొరకుండా రూ.80వేల కోట్లతో చంద్రబాబు నీళ్లను తీసుకువెళ్తున్నారని అన్నారు. తెలంగాణ ప్రజలు బీజేపీకి ఓట్లు వేయలేదా అని నిలదీశారు. ప్రభుత్వం కార్యాచరణ తీసుకోకుంటే ప్రజలను కలుపుకుని పోరాడుతామని చెప్పారు. రైతు సంబురాలు చేసుకోవడానికి ప్రభుత్వానికి సిగ్గనిపించడం లేదా అని నిలదీశారు. రైతులు అంటే పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి సోదరులకు సహాయం చేయడమా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు ఎన్. భాస్కర్‌రావు, రవీంద్రకుమార్, డాక్టర్ మెతుకు ఆనంద్ పాల్గొన్నారు.

ట్రంప్ హెచ్చరికలు.. దాడులకు దూరంగా ఉంటామన్న ఇజ్రాయెల్!

విశ్వంభర, నేషనల్ బ్యూరో : ఇజ్రాయెల్ఇరాన్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పినప్పటికీ.. ఇరు దేశాల మధ్య దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. తమ రాడార్ కేంద్రాలపై టెహ్రాన్ దాడులు జరిపిందని ఇజ్రాయెల్ ఆరోపించగా.. వాటిని ప్రధానమంత్రి కార్యాలయం కూడా ధ్రువీకరించింది. అయితే, ట్రంప్‌తో మాట్లాడిన తర్వాత తాము దాడులను తగ్గించామని, తదుపరి చేయబోమని నెతన్యాహు కార్యాలయం వెల్లడించింది.''కాల్పుల విరమణ అమల్లోకి వచ్చిన తర్వాత ఇరాన్ మాపై మూడు చోట్ల క్షిపణి దాడులు చేసింది. ప్రతిస్పందనగా అక్కడి రాడార్ వ్యవస్థలపై దాడులు చేశాం. అయితే, ప్రధాని నెతన్యాహుతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మాట్లాడిన తర్వాత తదుపరి దాడులకు దూరంగా ఉన్నాం. తమ యుద్ధ లక్ష్యాలన్నింటినీ సాధించడం పట్ల ఇజ్రాయెల్‌పై ట్రంప్ ప్రశంసలు కురిపించారు. అంతేకాకుండా కాల్పుల విరమణ స్థిరంగా కొనసాగుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు'' అని నెతన్యాహు కార్యాలయం వెల్లడించింది. అయితే, తొలుత తాము దాడులు చేసినట్లు ఇజ్రాయెల్ చేసిన ఆరోపణలను ఇరాన్ తోసిపుచ్చింది.

పుతిన్ మాట్లాడారు..

ఇరాన్‌లో పాలన మార్పును తాము కోరుకోవడం లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి స్పష్టం చేశారు. అదే జరిగితే తీవ్ర గందరగోళానికి దారితీస్తుందన్నారు. ది హేగ్‌లో జరగనున్న నాటో సదస్సులో పాల్గొనేందుకు బయలుదేరే క్రమంలో మీడియాతో మాట్లాడిన ట్రంప్.. ఇరాన్ వద్ద అణ్వాయుధం ఉండబోదన్నారు. పుతిన్ తనతో మాట్లాడినట్టు చెప్పారు.



రష్యా దాడిలో 26 మంది ఉక్రెయిన్ పౌరుల మృతి

కీవ్: ఉక్రెయిన్‌పై రష్యా నిర్వహించిన తాజా దాడిలో 26 మంది సాధారణ పౌరులు మరణించారని, దాదాపు 200 మందికి పైగా గాయపడ్డారని అధికారులు మంగళవారం వెల్లడించారు. డ్రోన్‌లు, క్షిపణులు, శతఘ్నులను ఈ దాడిలో ఉపయోగించారు. ఇవి ద్నిప్రో నగరంలో 19 పాఠశాలలతోపాటు 10 కిండర్‌గార్టెన్‌లు, ఒక వృత్తి విద్యా పాఠశాల, ఒక సంగీత పాఠశాల, సామాజిక సంక్షేమ కార్యాలయాన్ని ధ్వంసంచేశాయి. మరోవైపు రష్యా దాడుల్ని తిప్పికొట్టేందుకు మరింత సైనిక సాయం అందిస్తామని పాశ్చాత్య దేశాలు హామీ ఇవ్వాలని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ హేగ్‌లో ప్రారంభమైన నాటో శిఖరాగ్ర సదస్సులో డిమాండ్ చేశారు.

డీఈఈసెట్ కౌన్సెలింగ్‌లో అశాస్త్రీయ విధానానికి చెక్

విశ్వంభర, హైదరాబాద్: రాష్ట్రంలో రెండేళ్ల డీఈడీ కోర్సులో చేరేందుకు నిర్వహిస్తున్న డీఈఈసెట్ కౌన్సెలింగ్‌లో ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న అశాస్త్రీయ విధానానికి విద్యాశాఖ అధికారులు స్వస్తి పలికారు. రెండో విడత కౌన్సెలింగ్‌లో సీట్లు కేటాయించే సమయంలో ఈసారి తొలి విడతలో సీట్లు పొంది స్లైడింగ్ కోరుకున్న వారితోపాటు తాజాగా పోటీపడినవారిని కలిపి... మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయించనున్నారు. ఈ మేరకు తాజాగా నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటివరకు ఇందుకు భిన్నంగా సాగింది. ఉదాహరణకు కన్వీనర్ కోటాలో 4 వేల డీఈడీ సీట్లుంటే...తొలి విడతలో 3,500 మందికి సీట్లు దక్కాయి అనుకుందాం. రెండో విడతలో వారందరూ మెరుగైన కళాశాలల్లో సీట్లు పొందేందుకు స్లైడింగ్ ఆప్షన్ ఇచ్చుకున్నారు. రెండో విడతలో సీటు కోసం కొత్తగా మరో 500 మంది వెబ్ ఆప్షన్లు ఇచ్చుకున్నారు. అప్పుడు స్లైడింగ్‌లో పాల్గొన్న వారికి సీట్లు ఇచ్చిన తర్వాత... తాజాగా వెబ్ ఆప్షన్లు ఇచ్చుకున్న వారికి కేటాయించేవారు. రెండో విడతలో ప్రథమ ర్యాంకర్ పోటీపడ్డా... స్లైడింగ్ కోరుకున్న వారికి సీట్లు కేటాయించిన తర్వాతే ప్రథమ ర్యాంకర్‌కు సీటు ఇచ్చేవారు. అంటే మెరిట్‌ను పట్టించుకోకుండా సీట్లు కేటాయించేవారు. ఈ విధానాన్ని గత ఏడాది కొందరు అభ్యర్థులు వ్యతిరేకించారు. ఎన్నో సంవత్సరాలుగా ఇదే విధానాన్ని పాటిస్తున్నామని అధికారులు సమాధానమిచ్చారు. వాస్తవానికి డీఈఈసెట్‌లో తప్ప...రాష్ట్రంలో జరిగే ఏ ఒక్క కౌన్సెలింగ్‌లో కూడా ఇలాంటి విధానం లేదు. తాజాగా ఆ నిబంధనను సవరించారు. ఈసారి అటు స్లైడింగ్...ఇటు తాజా అభ్యర్థులను పరిగణనలోకి తీసుకొని... ఎవరికి మెరిట్ (ఉత్తమ ర్యాంకు, రిజర్వేషన్ తదితరమైనవి) ఉంటే వారికి సీట్లు కేటాయించేలా నిర్ణయం తీసుకున్నారు.

27 నుంచి రెండో విడత కౌన్సెలింగ్..

రాష్ట్రంలో 10 ప్రభుత్వ, 59 ప్రైవేట్ కళాశాలల్లో కలిపి...కన్వీనర్ కోటా 90 శాతం కింద మొత్తం 3,750 డీఈడీ సీట్లున్నాయి. ఈనెల 20న తొలివిడతలో 3,462 మంది సీట్లు పొందారు. వారు చేరేందుకు ఈనెల 25 వరకు గడువుంది. 27వ తేదీ నుంచి రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తామని, ఆ రోజు ఆయా పాత జిల్లా కేంద్రాల్లోని డైట్లలో ధ్రువపత్రాల పరిశీలనకు హాజరుకావొచ్చని డీఈఈసెట్ కన్వీనర్ జి.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 నుంచి 30 వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చని, జులై 5న సీట్లు కేటాయిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈసారి మేడ్చల్ జిల్లా పరిధిలోని నేరేడ్‌మెట్ ప్రభుత్వ డైట్‌లో తెలుగు, ఉర్దూ మీడియం సీట్లే ఉంటాయి. ఆంగ్లం లేకపోవడం వల్ల 50 సీట్లు తగ్గిపోయాయి.

రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లా మహిళా మోర్చా ఆధ్వర్యంలో "అమ్మ కి ప్రేమ తో ఒక మొక్క " కార్యక్రమంలో మొక్కల పంచడం జరిగింది. ఈ కార్యక్రమానికి బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరావు, బిజెపి ఖమ్మం జిల్లా అధికార ప్రతినిధి రాజేష్ గుప్తా, మహిళా మోర్చా బీజేపీ నాయకులు రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, మండల నాయకులు పాల్గొని విజయవంతం చేయడం జరిగింది.